# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 5

**శీతాకాలపు మంచుతెరల్ని చీల్చుకుంటూ కిటికీలోంచి మొహమ్మీద పడ్డ రవి కిరణాల వెచ్చదనానికి ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది నేహల.**

కళ్ళు నులుపుకుంటూ కిటికీ వైపు చూసింది. బారెడు పొద్దెక్కినట్లు బయట వెలుగుని చూస్తేనే తెలుస్తోంది. రాత్రి పొద్దుపోయేవరకూ ఆలయంలోనే గడిపింది.

కార్తీక అమావాస్య సోమవారమయ్యింది. శివాలయంలో అభిషేకాలూ చేసారు. పూజలు చేసారు. తరువాత అందరికీ గుడి వద్దే భోజనాలు. నిన్న రాత్రి వేదరాయశర్మ శిష్యులందరూ వచ్చారక్కడికి. గుడినుండి ఇంటికొచ్చేసరికి ఆలస్యమయ్యింది. తరువాత రేవన్నా, ప్రభలతో సంభాషించిన విషయాలు పదే పదే గుర్తుకొచ్చి చాలా సేపు నిద్ర పట్ట లేదు. మార్గశిర మాసం ఈనాటి నుండేనని తెలుసు.

సాధారణంగా సూర్యోదయం కాకుండానే తను నిద్ర లేస్తుంది. ప్రతీ దినమూ తండ్రికి పొలానికి కావల్సినవన్నీ తనే సర్దుతుంది. తను ఎదురొచ్చే వరకూ తండ్రి పొలానికి వెళ్ళడం తనకు ఊహ తెలిసి గుర్తులేదు.

నిద్రమత్తొదిలి ఒక్క ఉదుటున మంచమ్మీదనుండి వసారావైపు పరుగు తీసింది. తండ్రి కోసం చూసింది. అక్కడ కనిపించకపోయే సరికి వంటింటి వైపుగా వెళ్ళింది. అక్కడా ఎవరూ కనిపించ లేదు. తల్లి పూజాగృహంలో పూజ చేసుకుంటూ కనిపించింది. తండ్రి కోసం పెరటి వైపుగా వెళ్ళింది. తను నిద్ర లేవలేదని తండ్రి అలాగే పొలానికి వెళ్ళాడా? అసలే పంట కోతల కాలం. శీతాకలం వల్ల తొందరగానే చీకటి పడడంతో ఎక్కువ సేపు పొలం పనులు కావు. తన బద్ధకాన్ని చూసి తిట్టుకుంది నేహల. పెరట్లో తండ్రి కనిపించక పోయేసరికి వీధి వైపు వెళ్ళింది. బయట వీధరుగు మీద తండ్రి తాళ్ళు పేనుతూ కనిపించాడు.

తండ్రి హరేంద్రని చూసాక హమ్మయ్య అనుకుంది. పరుగున వచ్చిన నేహల్ని చూసి తండ్రి ఏమయ్యిందన్నట్లు మొహం చిట్లించాడు.

"ఇక్కడున్నావా? అప్పా? నీకోసం ఇల్లంతా గాలిస్తున్నాను. రాత్రి సరిగా నిద్ర పట్ట లేదు..తెల్లారినా మెలకువ రాలేదు..నువ్వింకా పొలానికి వెళిపోయావేమోనని కంగారు పడ్డాను..." నేహల కళ్ళు నులుముకుంటూ అంది.

"నువ్వు ఎదురు రాకుండా ఎలా వెళతాననుకున్నావు తల్లీ? ఎప్పుడైనా అలా చేసానా? మంచి నిద్రలో ఉన్న నిన్ను లేపడం ఇష్టం లేకపోయింది. మీ అమ్మ నిన్ను లేపమని పోరినా నేను పట్టించుకోలేదు. నా తల్లి ఎప్పుడయినా లస్యంగా లేస్తుందా చెప్పు?..." హరేంద్ర కూతురి తల నిమిరుతూ అన్నాడు.

"నాకు తెలుసు నువ్వు వెళ్ళవనీ..కానీ కోతల సమయం కదా? వెళిపోయావేమో ననుకున్నాను..ఒక్క నిమిషం ఆగు. మొహం కడుక్కుని నీ పొలం సామాన్లు సర్దుతాను." అరుగు మీదనుండి లేస్తూ అంది నేహల. కూతురు కేసి ప్యాయంగా చూసాడు హరేంద్ర.. కూతురికి తనంటే ఎంత ప్రేమో కదా అనుకున్నాడు.

"నేనే అన్నీ సర్దానుకానీ - త్వరగా మొహం కడుక్కుని రా? త్వరగా వెళ్ళాలి."

నేహల ఒక్క ఉదుటున పెరట్లోకి వెళ్ళింది. రేగిన జుట్టుని ముడికింద చుట్టుకొని మొహం కడుక్కుని తిరిగి వచ్చింది. తండ్రి పొలానికి కావల్సిన సామాన్లు ఉన్న చేతి సంచీని ఒక చేత్తో తీసుకుంది. మరో చేత్తో కొడవలీ, తాళ్ళూ తీసుకొని వీధి వైపు వెళ్ళింది.

తండ్రి పొలానికి వెళ్ళడానికని కాలి చెప్పులు ధరించాడు. నేహల చేతి సంచీ అందించింది. కుడిచేత్తో కొడవలీ, తాళ్ళు అందిస్తుంటే తండ్రి హరేంద్ర చూపులు నేహల చేతి మణికట్టు దగ్గర గిపోయాయి. మిలమిలా మెరుస్తూ నేహల చేతికున్న పద్మాకారపు తాయత్తు కేసే పరికించి చూసాడు. చేతికి కొత్త ఆభరణం ఎక్కడిదా అని ఆశ్చర్యపోయాడు.

''ఏంటి తల్లీ? నీ చేతిని తాయత్తు..?'' అనుమానంగా అడిగాడు.

తండ్రి తాయత్తుని గమనించాడని గ్రహించింది నేహల.

''ఇదా! రేవన్నా, ప్రభా నాకోసం విజయనగరం వెళ్ళినప్పుడు కానుకగా తీసుకొచ్చారు. నచ్చింది కదాని చేతికి పెట్టుకున్నాను. ఏం? బాగోలేదా?...తీసెయ్యనా?'' హరేంద్ర కేసి చూస్తూ అంది.

తండ్రికి రేవన్న ఇచ్చాడని చెబితే ఏమయినా అనుకుంటాడని ప్రభ పేరు కూడా కలిపి చెప్పింది. తండ్రికి అబద్ధం చెప్పడం ఇష్టం లేదు. అలాని నిజమూ చెప్పలేదు. చెప్పే చనువున్నా, ధైర్యం లేదు.

''చేతిని తళతళా మెరుస్తూంటే ఎక్కడిదా అనుకున్నాను. నీక్కావాలంటే నేనే చేయిస్తాను కదమ్మా? ఎవరో ఇచ్చింది ఎందుకు?... ''

హరేంద్రకి నేహల ఇంకొకరు ఇచ్చినవి ధరించడం ఇష్టం లేదు. అలా అని పైకి అనకపోయినా అదే అర్థం వచ్చేటట్లుగా చెప్పాడు.

''ఏం బాగోలేదా, అప్పా? '' సంశయిస్తూ అంది నేహల.

కూతురుకి కష్టం కలిగించేలా హరేంద్ర ఎప్పుడూ ప్రవర్తించడు.

''బానేవుంది. నీకు నచ్చితే ఉంచుకో! తీసెయ్యడం దేనికి?''

తండ్రి తన ఇష్టాన్ని ఎప్పుడూ కాదనడన్న విషయం నేహలకి తెలుసు. అలాని తనెప్పుడూ ఉపయోగించుకోదు.

''సరే! ఇవాళ పెందలాడే రా! ఈ రోజు నుండి మార్గశిర మాసం. అమ్మ అశ్వత్థ నారాయణ స్వామి ఆలయంలో ధనస్సు పూజ చేయిస్తుంది.'' తండ్రికి తల్లి పూజ విషయం గుర్తు చేసింది నేహల.

''తెలుసమ్మా! వస్తాను..'' అంటూ కూతురి తలపై నిమిరి పొలానికి బయల్దేరాడు హరీంద్ర.

తండ్రి వీధి మొగ దాటేవరకూ ఇంటి బయటనుండే చూస్తూ ఉండిపోయింది నేహల.

0000000000

హరేంద్ర పొలానికి వేదరాయ శర్మ ఇంటి మీదుగానే వెళ్ళాలి. ప్రతి దినమూ పొద్దెక్కకుండానే వెళతాడు. ఈ రోజు కాస్త ఆలస్యం అయ్యింది. వేదరాయ శర్మ ఇల్లు సమీపించే సరికి ఒక్కసారి అటుగా చూసాడు. శర్మగారు వీధి అరుగు మీద కూర్చుని ఉన్నాడు. పక్కనే ముగ్గురు కుర్రాళ్ళున్నారు. అందులో ఒకరు హరేంద్రకి పరిచయముంది. అందులో ఒకతని ఏవో సూచనలు ఇస్తూ కనిపించాడు. ఆ వ్యక్తి వెను తిరిగుండడం వల్ల సరిగా గుర్తించ లేక పోయాడు, హరేంద్రని చూడగానే వేదరాయ శర్మ నవ్వుతూ పలకరించాడు. హరేంద్ర నమస్కరిస్తూ వారు కూర్చున్న చోటకి వెళ్ళాడు.

"ఏం హరేంద్ర? బావున్నావా? ఈ సారి పంటలెలా వున్నాయి?"

"నమస్కారమయ్యా! దేవుడి దయవల్ల అంతా బాగానే ఉందయ్యా!"

హరేంద్ర మాటలు విని మూడో వ్యక్తి తలతిప్పి చూసాడు. అతనెవరో కాదు రేవన్న. వెనుకనుండి పోల్చుకోలేకపోయాడు హరేంద్ర. అతన్ని చూస్తూ నవ్వాడు రేవన్న. హరేంద్రా బావున్నావా అన్నట్లుగా తలూపాడు.

"ఏంటి పొలానికా?" వేదరాయ శర్మే ప్రశ్నించాడు.

"అవునయ్యా..ఇవాళ కాస్త ఆలస్యమయ్యింది. మా నేహలమ్మ ఎదురొస్తే కానీ పొలానికెళ్ళే అలవాటు లేదు. అది పొద్దుపోయి లేచింది. అందువల్లే పొద్దుపోయింది సామీ.."

"బావుందయ్యా! కూతురు ఎదురొస్తేకానీ పొలానికి వెళ్ళవా? రేప్పొద్దున్న పెళ్ళిజేసి పంపిస్తే..? నువ్వూ మీ అమ్మాయితో పాటే కాపురానికి వెళతావా ఏమిటి?" హాస్యంగా గట్టిగా నవ్వుతూ అన్నాడు వేదరాయశర్మ. అక్కడున్న శిష్యులూ గట్టిగా నవ్వారు.

"అప్పటి సంగతి అప్పుడు చూద్దామయ్యా! ఇంకా దానికి మంచి సంబంధం కుదరాలి కదా?"

"ఎందుకు కుదరదు? నేహలకేం తక్కువని? కుందనపు బొమ్మలా వుంటుంది! ఏం వినయమూ, విధేయతా? బంగారానికి సువాసినబ్బిన అపరంజి బొమ్మ. తండ్రిగా నువ్వు అనవసర దిగులు పడుతున్నావు కానీ, ఏ రాజ కుమారుడో ఎగరేసుకు పోతాడు." వేదరాయశర్మ నేహలగురించి ఎంతో గొప్పగా చెప్పేసరికి లోలోపలే పొంగిపోయాదు హరేంద్ర.

"అవునయ్యా..పెళ్ళి సంబంధం చూడాలి. పిల్లకీ వయసొస్తోంది..." అంతకు మించి ఏమీ అనలేకపోయాడు.

పెళ్ళి పేర్చు చెబితే అతనికి తీరని బెంగ. కూతురు దూరమవుతుందన్న ఊహ అతను భరించలేడు. నేహలకి పెళ్ళి చెయ్యకుండా ఎంతకాలం ఉంచుతాడు? ఇంట్లో భార్య ఒప్పుకుంటుందా? కూతుర్ని విడిచి ఏ తండ్రీ ఉండలేడు. అలాని సృష్టి విరుద్ధంగా ప్రవర్తించనూ లేడు. ***అనుబంధాలకతీతం సృష్టిధర్మం. ఒక్కో వయసులో ఒక్కో బంధానికి ప్రాముఖ్యత. జీవితం అంటే అదే!***

***అనుబంధాలు మనిషికి అవసరమే! ఒక్కోసారి వాటికి తోడుగా బెంగలూ, బాధలూ మోసుకొస్తాయి.***

పొలానికి వెళ్ళాలని చెప్పి వేదరాయశర్మ వద్ద శలవు తీసుకున్నాడు హరేంద్ర. వేదరాయ శర్మ రేవన్నకి ఏదో వివరాలి చెప్పి వెళ్ళమన్నట్లు పంపాడు. హరేంద్రతో వెనకాలే రేవన్నా బయల్దేరాడు. తన వెనుకే వస్తున్న రేవన్నని చూసి పలకరించాడు.

"ఏం రేవన్నా? పట్నానికా?"

"అవునయ్యా? గురువుగారు రాయాచూరు పని మీద పంపారు. రేపటికల్లా వచ్చేస్తాను. ఊరి చివర గుర్రబ్బండి బాడుగ కట్టించుకొని వెళతాను."

అలాగా అన్నట్లు తలూపాడు. ఉదయాన్నే గురువుగారు రమ్మనమని కబురంపారు రేవన్నకి. వచ్చే వారం ఆయన విజయనగరం వెళుతున్నారు. ఈలోగా మసూమ్ని కలవమని కబురొచ్చింది. విజయనగరం వెళ్ళే ముందు అతని ద్వారా ముస్లిమ్ రాజుల విషయాలు తెలుస్కోడానికి రేవన్నని పంపాడు. పని వత్తిడివల్ల మసూం రాలేనని కబురంపింతే రేవన్నని పంపక తప్పలేదు. ఈ విషయం రేవన్న హరేంద్రకి చెప్పలేదు. కేవలం పని మీద వెళుతున్నట్లుగానే చెప్పాడూ. హరేంద్రా ఏ పనని రెట్టించలేదు.

రేవన్న ఊరి చివరకి రాగానే హరేంద్ర వద్ద శలవు తీసుకున్నాడు. హరేంద్ర పొలంవైపుగా వెళిపోయాడు.

రేవన్న ఊరిపొలిమేరల్లో ఒక గుర్రబ్బండతనితో రాయచూరుకి రెండు దొడ్డ వరహాలకి బాడుగ కట్టించుకున్నాడు. గురువుగారు ఖర్చుల నిమిత్తమై అయిదు దొడ్డవరహాలిచ్చారు. రాయచూరు బండి ప్రయాణమయితే సాయంత్రానికి చేరుకోగలడు. తనతో పాటే తినడానికి ఇంటి నుండి చద్దన్నం తెచ్చుకున్నాడు. గురువుగారు మసూంని ఎక్కడ కలుసుకోవాలో చెప్పారు. రాయచూరు బంగారు బసప్ప గుడి పూజారిని కలిస్తే ఆయన మసూంకి కబురు పంపిస్తాడని చెప్పాడు. గుడి పూజారి రేవన్నకి పరిచయం లేదు. సాయంత్రానికల్లా

రాయచూరు చేరుకున్నాడు. సరాసరి బసప్ప గుడికి వెళ్ళి తను వేదరాయశర్మ పంపితే వచ్చానని గుడి పూజారికి పరిచయం చేసుకున్నాడు. పూజారి మసూంని తీసురమ్మనమని ఒకతనకి పురమాయించాడు. కొంతసేపయ్యాక మసూం వచ్చాడు. అప్పటికే చీకటి పడింది. మసూంని చూడగానే గుర్తుపట్టాడు రేవన్న. రేవన్న తనకి ఎరుగున్న వ్యక్తే నన్నట్లుగా పలకరించాడు మసూం.

వేదరాయ శర్మ ఓ నాలుగురోజుల్లో విజయనగరం వెళుతున్నట్లుగా చెప్పాడు.

"నేనే మీ ముద్గల్ వచ్చి గురువుగారిని కలుద్దామాని అనుకుంటున్నాను. ఇక్కడ గుల్బర్గాలో చాలా జరుగుతున్నాయి.." అంటూ తన చేతి సంచీ నుండి ఒక పత్రం తీసుకొచ్చాడు.

అది రేవన్నకి చూపిస్తూ -

"ఫిరోజ్‌షా భీమనది ఒడ్డున ఒక పెద్ద కోట కట్టబోతున్నాడు. ఇది కోట నమూనా చిత్రపటం. ఇది నేను అసలు ప్రతిని చూసి నాకొచ్చిన గీతలతో గీసాను. ఈ చిత్రపటం దేవరాయలకందివ్వాలి. ప్రస్తుతం యుద్ధ ప్రయత్నాలేవీ జరగకపోయినా, ఫిరోజ్‌షా ఏదో పెద్ద ఆలోచనలో ఉన్నట్లే కనబడుతోంది. వివరాలన్నీ ఈ లేఖలో వున్నాయి. ఇది మీ గురువుగారికియ్యి. "అంటూ కోట చిత్రపటం అందించాడు.

రేవన్న చిత్రపటం విప్పి చూసాడు. అంతా గజిబిజిగా అనిపించింది.

ఆ రాత్రి కొంతసేపు ముచ్చటించాకా మసూంణ వెళిపోయాడు. రాత్రికి గుడి పూజారి ఇంట్లోనే బస చేసాడు రేవన్న. ముద్గల్ కంటే రాయచూరులో చలి ఎక్కువగా ఉందనిపించింది రేవన్నకి. మర్నాడు ఉదయమే ముద్గల్‌కి తిరుగు ప్రయాణం కట్టాడు రేవన్న.

000000000

ఎప్పటిలాగే ఆనాడూ వేదరాయశర్మ వద్ద పాఠానికి బయల్దేరింది నేహల. వెళ్ళేసరికి గురువుగారింట మిగతా శిష్యులందరూ అప్పటికే వచ్చి వున్నారు. ప్రభా, మిగతా స్నేహితులూ ఒక చోట గుమిగూడి ఏదో చూస్తూ కనిపించారు. గురువుగారి చేతిలో ఏదో ఉంది. ఏమిటా అన్న ఉత్సాహంతో పరికించి చూసింది నేహల. గురువుగారి చేతిలో పెద్ద చిత్రపటం కనిపించింది. ఆ చిత్రంలో విరూపాక్ష - ఆలయం చుట్టూ వీధులూ చిత్రీకరించబడి ఉన్నాయి.

చిత్ర పటం వేసింది దేవరాయశర్మ మరో శిష్యుడు శంభుడు. నల్లని గీతలతో చిత్రపటం చాలా అందంగా వుంది. వేదరాయ శర్మ అన్ని కళలనీ ప్రోత్సహించేవాడు. ఆయన శిష్యులకి ఒక్కొక్కరికీ ఒక్కోదాంట్లో ప్రావీణ్యం ఉంది. రేవన్నకి సంగీత సాహిత్యంలో ప్రావీణ్యం ఉంది. నృత్యం పట్ల అభిలాష ఉంది కానీ ఆ కళపై మక్కువ అంతంత మాత్రమే. నేహలకి సంగీతమూ, నృత్యమూ అంటే ఇష్టం. ఎందుకో సంస్కృతం ఓ పట్టాన మింగుడు పడేది కాదు. ప్రభకి వీణవాదనంలో ప్రతిభుంది. అలాగే శంభుడికి చిత్రకళంటే ఎక్కువ అభిమానం. అందరూ అన్నీ నేర్చుకునేవారు. వేదరాయ శర్మ అందర్నీ ప్రోత్సహించేవాడు.

ఆ చిత్ర పటాన్ని చూస్తూ వేదరాయశర్మ అక్కడున్న వారందరికీ చెబుతున్నాడు.

"విరూపాక్షాలయం కళ్ళకు కట్టినట్లు బొమ్మ గీసాడు. శంభూ ఈ చిత్ర పటం చాలా బాగుంది. ఇది దేవరాయలుకి మనం కానుకగా ఇద్దాం. ఇంకా రంగులద్ది దీనికి మెరుగులు దిద్దు. నేనెలాగూ విజయనగరం వెళుతున్నాను కదా? అప్పుడు తీసుకెళతాను."

అంతవరకూ చిత్రపటాన్ని దీక్ష చూస్తున్న నేహల విజయనగర ప్రయాణం అనగానే ఒక్కసారి తలతిప్పి చూసింది. విజయనగరం గురువుగారు ఒక్కరే వెళ్ళరు. తనకి సాయంగా శిష్యుల్నీ తీసుకెళతాడు. అంటే రేవన్న కూడా వెళ్ళే అవకాశం వుంది.

ఇది విని నేహలకి దిగులు మొదలయ్యింది. వేదరాయశర్మ ఖచ్చితంగా రేవన్ననే తోడుగా తీసుకు వెళతాడు. విజయనగరం అంటే కొన్ని వారాలే పట్టచ్చు. క్రితంసారి విజయ దశమి ఉత్సవాలకని వెళ్ళి దాదాపు అయిదారు వారాలు అక్కడే ఉండిపోయారు. ఇది తలుచుకున్నప్పటినుండీ నేహలకి బెంగ మొదలయ్యింది. మార్గశిర మాసం చివర్లో తన పుట్టిన పండగ. ఈ సారి రేవన్న గురించీ, తన ప్రేమ గురించీ తండ్రి హరేంద్రకి చెప్పాలని నిర్ణయించుకుంది. తన ఇష్టాన్ని తల్లీ, తండ్రీ కాదనరని తెలుసు. కానీ ఎలా చెప్పాలా అన్నదే తనకి తెలీదు. భయం కంటే ఒకరకమైన బిడియం.

రేవన్న తనతో మాట మాత్రమైనా చెప్పకుండా రాయచూరు వెళ్ళినందుకు పీకలవరకూ కోపంతో ఉంది నేహల. పుండు మీద కారం జల్లినట్లు మరలా ఈ విజయనగర ప్రయాణమొకటి. అప్రయత్నంగా పళ్ళు కొరుక్కుంది నేహల. నిన్నటి రోజు గురువు గారి దగ్గరకెళ్ళినపుడు తెలిసింది రాయచూరు వెళ్ళాడని. ఏదో అత్యవసర పని పడితే పంపారని తెలుసింది. వెళ్ళి నందుక్కాదు, తనకి చెప్పకుండా వెళ్ళినందుకొచ్చిన్న ఉడుకుమోత్తనం.

అప్పుడు గురువుగారు తన విజయనగర ప్రయాణం గురించి చెప్పాడు. సంక్రాంతి వెళ్ళే వరకూ రావడం కుదర్దనీ, ఈ సారి అశ్వత్థ నారాయణ స్వామి కోవెలలో సంక్రాంతి సంబరాలకి ఉండడం కుదరదని చెప్పాడు. ప్రతీ ఏడూ సంక్రాంతికి గుళ్ళో నృత్య ప్రదర్శన చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ ప్రదర్శన ఎప్పుడూ వేదరాయ శర్మ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఈసారి ప్రదర్శన చేసే భారం శిష్యులపైనే మోపాడు వేదరాయ శర్మ. రేవన్నా, గురువుగారూ ఉండరని తెలిసీ నిరుత్సాహ పడింది నేహల. ఈసారి రేవన్నని ఎలాగైనా విజయనగరం వెళ్ళకుండా అడ్డుకోవాలి. ఏదో ఒక వంక చూపించి విజయనగర ప్రయాణం ఆపాలి. ఏ కారణం చెప్పి రేవన్నని ప్రయాణం నుండి తప్పించాలా అని ఆలోచిస్తోంది.

ఆ నాడు మధ్యాహ్నం రేవన్న వచ్చాడు. సమయానికి నేహల వేదరాయ శర్మ ఇంటి వద్దే ఉంది. తనతో పాటూ ప్రభా మిగతా శిష్యులూ ఉన్నారు.

వస్తూనే గురువుగారికి నమస్కరించాడు. అక్కడ నేహలని చూడగానే అతని కళ్ళు మెరిసాయి. నవ్వుతూ చూసాడు నేహలకేసి. అతని చిరునవ్వుని స్వీకరించలేదు. కోపంగా తల తిప్పుకుంది. కోపానికి కారణం అర్థమయ్యింది అతనికి. వీళ్ళిద్దరినీ ప్రభ గమనిస్తూనే ఉంది.

వేదరాయశర్మ "ప్రయాణం బాగా జరిగిందా?, ఇబ్బందులేమీ లేవు కదా? " అంటూ ప్రశ్నించాడు. కొంతసేపయ్యాక ఆ నాటి పాఠం ముందుగానే ముగించేసి, శిష్యులని ఇంటికి వెళ్ళమని చెప్పాడు. రేవన్ననీ మాత్రం అక్కడే ఉండమన్నాడు.

అందరితోనూ కలిసి ఇంటికి బయల్దేరింది నేహల. రేవన్న గుడిదగ్గరకి రమ్మన్నట్లు సైగ చేసాడు.

రానన్నట్లుగా తలూపింది. నేహల బింకం రేవన్నకి తెలుసు. కానీ పదిమంది ముందూ ఆమెకెలా చెప్పేది?

అందుకే మాట్లాడకండా వూరుకున్నాడు.

నేహల మిగతా స్నేహితులతో బయటకు వచ్చింది. రేవన్న అక్కడే గురువుగారి దగ్గర ఉండిపోయాడు.

ఆమె ధ్యాసంతా రేవన్న మీదే ఉంది. లోపల గురువుగారితో ఏం మంతనాలు చేస్తున్నాడో? అతని విజయనగర ప్రయాణం ఎలా - ఆపాలన్నదే ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టింది..

లోపల వేదరాయ శర్మకి రాయచూరు వివరాలు చెప్పాడు రేవన్న.

"ఇది ఫిరోజ్‌షా కట్టబోయే కొత్త కోట నమూనా. మసూం తన చేతికొచ్చినట్లు గీసాడు. గురువుగారూ మసూంని కలవడానికి ఈ సారి ఎందుకో భయమేసిందండీ. రాయచూరు నుండి వెనక్కి వచ్చేటప్పుడు ఏ సైనికుల కంట పడినా ప్రమాదమేనని భయం వేసింది. ముఖ్యంగా ఎవరైనా చూస్తారేమోనని."

"భయం దేనికి? అందుకే శివాలయం పూజారిని కలవమన్నది. ఆయనే అన్నీ చూసుకుంటాడు. ఈ చిత్రపటమూ, ఈ లేఖా అన్నీ దేవరాయలకందిస్తాను. మన శంభుడి చేత రేపు దీన్ని మరలా అందంగా గీయిస్తాను.."

"ఇది రహస్యం కదా గురువుగారూ! శంభుడికి తెలిసిపోదూ?" తన అనుమానం వ్యక్తం చేసాడు రేవన్న.

"ఏం పరవాలేదు. రాజుల కోటని ఏదో సర్ది చెబుతాలే! నువ్వు మాత్రం ఈ విషయాలన్నీ గోప్యంగా ఉంచు. ఎవరి దగ్గరా నోరు జారకు. తెలిసిందా?" వేదరాయశర్మ హెచ్చరించాడు.

అలాగే నన్నట్లు తలూపాడు. కొంతసేపు అవీ ఇవీ ముచ్చటించుకున్నాక ఇంటి ముఖం పట్టాడు రేవన్న.

అప్పటికే చీకటపడుతోందనీ, ఇంటికి వెళ్ళాలని చెప్పి బయల్దేరాడు.

ఇంట్లోకి అడుగు పెడుతూండగా వెనుకనుండి ఎవరో చెయ్యిపట్టుకొని పక్కకు లాగినట్లుగా అనిపించి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసాడు. ఒక్కసారి భయమేసింది.

ఎవరాని చూస్తే నేహల.

"నువ్వా? ఏంటి ఇలా వచ్చావు? ఎవరైనా చూస్తే? " పక్కనే ఉన్న చెట్టు చాటుకెళ్ళారిద్దరూ.

నేహల ఏమీ మాట్లాడ లేదు. నేహల కళ్ళల్లో కోపం కనిపించింది రేవన్నకి.

"నేనే ఈ రాత్రి మీ ఇంటికొద్దామా అనుకున్నాను? ఏంటి ఇలా వచ్చావు?"

"ఏం? కనీసం ఒక్క మాట చెప్పాపెట్టకుండా వెళిపోయావు. నిన్నసలు.." కోపంగా చెయ్యెత్తింది నేహల.

"నిన్న ఉదయాన్నే గురువుగారు వేంటనే రమ్మనమని కబురు పంపారు. ఉన్న పళాన ప్రయాణం కట్టించారు. మీ ఇంటికొచ్చి చెప్పే వ్యవధి లేదు. నన్ను నమ్ము. " ప్రాధేయ పడ్డాడు.

"అది సరే! ముందు విజయనగరం వెళ్ళనని నువ్వు నాకు మాటియ్యి. అంతవరకూ నిన్నొదిలేది లేదు."

"విజయనగరమా! నీకు తెలిసిందా? గురువుగారూ ఇవాళే నాతో చెప్పారు. "

"నువ్వేమన్నావు? వస్తానని మాటిచ్చావా?" కంగారుగా అంది.

లేదన్నట్లుగా తలూపాడు రేవన్న.

"లేదు. ఈ సారి రాలేనని చెప్పాను."

"అలా చెబితే గురువు గారేమన్నారు?"

"తప్పదన్నారు. కానీ.."

నేహలకి ఆత్రుత పెరిగింది. రేవన్న చెయ్యి పట్టుకుంది.

"నాకే వెళ్ళడం ఇష్టం లేదు. మా అమ్మకి సుస్తీ చేసిందని వంక పెట్టాను. వాళ్ళకి నా అవసరం ఉందని రాలేనని చెప్పాను."

"గురువు గారేమన్నారు?"

"ముందు ఒప్పుకోలేదు. కానీ నేను తప్పదని అంటే ఎవరో ఒకర్ని తీసుకెళతానులే అని చెప్పారు."

ఒక్కసారి హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంది నేహల.

"నువ్వెక్కడ విజయనగరం వెళతావోనని ఎంత కంగారు పడ్డానో నీకేం తెలుసు?".

నవ్వుతూ నేహలని చూసాడు. చిమ్మ చీకటిలో చంద్రబింబంలా ఆమె ముఖం వెలిగిపోతోంది.

"మరెవరు గురువుగారికి తోడుగా వెళుతున్నారు?"

"అదా? శంభుణ్ణి తీసుకెళ్ళమని నేనే చెప్పాను."

"మంచి పని చేసావు?"

"నేహలా! నేనంటే నీకు ఎంత ఇష్టమో, నువ్వన్నా నాకు అంతే! క్రితంసారి విజయనగరం వెళ్ళినప్పుడు ఓ నెల్లాళ్ళు నేనెంత మనస్థిమితం లేకుండా గడిపానో నీకు తెలీదు. నీకోసమే నేను వెళ్ళడం లేదు నేహలా? అమ్మ అనారోగ్యం కేవలం సాకు మాత్రమే! "

ఇది విని ఒక్కసారి రేవన్నని చుట్టుకుపోయింది నేహల. అశ్రునయనాలతో  ఆమె చెక్కిలి తడిసిపోయింది.

విజయనగర ప్రయాణం రేవన్నకి లేదని తెలిసి ఆనందించింది నేహల.

శంభుడి ద్వారా తమకి జరిగే కీడుని ఆ క్షణం ఊహించలేదు ఇద్దరూ! శంభుడే వారి జీవితాలని నిర్దేశిస్తున్నాడని ఏమాత్రమూ స్ఫురించలేదు.

రేవన్న వేదరాయ శర్మతో వెళ్ళకపోవడమే అతను చేసిన పెద్ద తప్పు. అది ఎంత పెద్ద తప్పో కాలమే నిర్ణయిస్తుంది..

0000000000

.

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

